క్లుప్తంగా

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మధ్యాహ్నం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవా సంఘం, రెడ్ల కల్యాణ మండపం కార్యవర్గసభ్యుల సహకారంతో అన్నప్రసాద సేవా కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రతి సోమవారం తమ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ రెడ్డి, సభ్యులు విష్ణు నారాయణ, విజయకుమార్, లింగారెడ్డి, కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

రేపు మంత్రి సత్యకుమార్ రాక

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల 20వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం సాయంత్రం రాయల్ కౌంటీ రిసార్ట్స్ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ హాజరు కానున్నారు. కార్యక్రమంలో యోగివేమ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డితోపాటు పలువురు పాల్గొననున్నారు. అనంతరం స్థానికంగా నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొననున్నారు.

ఆటో బోల్తా



బోల్తా పడిన దోస పండ్ల ఆటో

చాపాడు : మండల పరిధిలోని పల్లవోలు సమీపంలో సోమవారం దోస పండ్ల ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దేవగుడి జీవరత్నం అనే వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. జమ్మలమడుగు మండలం దేవగుడికి చెందిన జీవరత్నం ఆటో నడుపుకుంటూ మైదుకూరు నుంచి ప్రొద్దుటూరుకు దోస పండ్లను తీసుకెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జీవరత్నంకు గాయాలయ్యాయి.

ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలి

రాజుపాళెం : స్కూల్స్, ఇంటర్మీడియట్, హైయర్ ఎడ్యుకేషన్లలో సంబంధిత అధికారులు ప్రభుత్వ విద్యను ప్రోత్సహించకుండా ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తున్నారని రాయలసీమ స్టూడెంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ పేర్కొన్నారు. రాజుపాళెంలో విలేకరులతో మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా ప్రైవేటు పాఠశాలలకు, కళాశాలలకు అధికారులు తొత్తుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఎటువంటి నిబంధనలను పాటించకుండా వారి ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ మౌలిక వసతులు లేకుండా పాఠశాలలను, కళాశాలలను నడుపుతున్నారని పేర్కొన్నారు. అధికారులు రూ.లక్షలు జీతాలు తీసుకుంటూ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ నిధులతో బోరు ఏర్పాటు



బోరుకు మోటార్‌ను ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ నాగేంద్ర బాబు తదితరులు

మైదుకూరు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె వద్ద ఉన్న పురాతన శివాలయం వద్ద పంచాయతీ నిధులతో కొత్త బోరు వేశారు. సోమవారం బండి నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో బోరుకు మోటార్‌ను ఏర్పాటు చేశారు. శివాలయాన్ని అభివృద్ధి చేసేందుకు చేపట్టే పనులకు నీటి వసతిని కల్పించేందుకు బోరు వేసినట్టు ఈ సందర్భంగా సర్పంచ్ నాగేంద్ర బాబు తెలిపారు. పార్టీలకతీతంగా గ్రామస్తులందరూ శివాలయం అభివృద్ధిలో పాలుపంచుకోవడం హర్షణీయమని అన్నారు.

వాహనాల తనిఖీ

కడప అర్బన్: జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ ను మరింత బలోపేతం చేయాలని జిల్లా పోలీసులకు జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా సోమవారం పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను విచారించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్ల డ్రైవర్లు సీటు బెల్టు వేసుకోవాలన్నారు.

సదా సాగాలి.. రంజాన్ స్ఫూర్తి

ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

ప్రొద్దుటూరు కల్చరల్ : ముస్లింల పవిత్ర పండుగ రంజాన్‌ను సోమవారం ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా అల్లాహ్‌ను స్తుతిస్తూ ఒకరికొకరు రంజాన్ ముబారక్ తెలుపుకొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానానికి చేరుకుని ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మౌలానా మేరాజ్‌రజా నమాజ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అల్లా చూపిన శాంతి, దయ, సేవా మార్గంలో నడవాలన్నారు. రంజాన్ స్ఫూర్తి సదా సాగాలని పిలుపునిచ్చారు. ప్రార్థనల అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేదలకు ఫిత్రా(దానం) చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

మజ్జిగ, ఆరంజ్ జ్యూస్ పంపిణీ

స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం అల్లుట్ల కొండయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ, ఆరంజ్ జ్యూస్, మంచినీరు పంపిణీ చేశారు.

■ పట్టణానికి చెందిన నటుడు దావూద్ కేరళలో రంజాన్ ప్రార్థనలో పాల్గొన్నారు. షూటింగ్ నిమిత్తం కొన్ని రోజుల క్రితం ఆయన కేరళకు వెళ్లారు. కేరళలోని మున్నార్ పీర్ మేడు పట్టణంలో స్థానిక ముస్లింలతో కలసి దావూద్ ప్రత్యేక ఈద్ నమాజ్‌లో పాల్గొన్నారు.

పేదలకు తోచినంత దానం చేయాలి

రాజుపాళెం : ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దానిలో కొంత భాగంగా పేదలకు దానం చేయాలని ముస్లింల మత పెద్ద హజీబ్ పేర్కొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లోని మసీదుల వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని తెలిపారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : మాట్లాడుతున్న మౌలనా మేరాజ్ రజా

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

మైదుకూరు : మైదుకూరులో సోమవారం రంజాన్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం స్థానిక నంద్యాల రోడ్డులోని ఈద్గా వద్దకు చేరుకొని అక్కడ ప్రార్థనలు నిర్వహించారు. మత గురువులు ఖురాన్‌లోని సూక్తులను వినిపించారు. అనంతరం పరస్పరం పండుగ శుభాకాంక్షలను తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. అనంతరం స్థానిక కడప రోడ్డులోని కబరస్థాన్‌లో దివంగతులైన పెద్దలను పలువురు స్మరించుకున్నారు.



ఖాజీపేట : ప్రవక్త సందేశాన్ని వినిపిస్తున్న మత పెద్ద

నల్ల బ్యాడ్జీలతో నిరసన

రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న వక్ఫ్ బిల్లుపై నిరసన వ్యక్తం చేశారు. ప్రార్థనల్లో పాల్గొన్న పలువురు చొక్కాలపై జబ్బల వద్ద నల్లని పట్టీలను ధరించి వక్ఫ్‌బోర్డు బిల్లు అమలుకు అభ్యంతరం తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు.



ప్రొద్దుటూరు కల్చరల్: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చాపాడులో..

చాపాడు : మండల వ్యాప్తంగా సోమవారం ముస్లీం సోదరులు భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు జరుపుకున్నారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని మండలంలోని చాపాడు, ఖాదర్‌పల్లె, వెదురూరు, రాజుపాళెం, తిమ్మాయపల్లె, అల్లాడుపల్లె, కేతవరం, పెద్దగురువళూరు, ఓబుళరెడ్డిపేట, మడూరు, అన్నవరం, గుంతచీపాడు గ్రామాలలోని ఈద్గా, మసీదుల వద్ద రంజాన్ ప్రార్థనలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువులు రంజాన్ పండుగ విశిష్టత, గొప్పతనం గురించి వివరించారు. కులమతాలకతీతంగా ముస్లీం సోదరులు తమకు తోచిన విధంగా ఇతరులకు సహాయం అందజేశారు.

ఖాజీపేట : రంజాన్ పండుగను ఖాజీపేట మండలంలోని ముస్లీంలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉపవాస దీక్షలను పూర్తి చేసిన తరువాత పండుగ రోజున ఖాజీపేట టీచర్స్‌కాలనీలోని ఈద్గ వద్ద, అలాగే సర్వర్‌ఖాన్ పేట, అగ్రహారంలోని నత్తడ్ షా వలీ దగ్గర ఉన్న దర్గా వద్ద పెద్ద ఎత్తున ముస్లీంలు హాజరై ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్ద వచ్చిన వారికి దేవుని సందేశం వినిపించారు. దుంపలగట్టు గ్రామంలోని ఈద్గ వద్ద ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ముస్లీంలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

బద్వేలు అర్బన్ : నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలను ఆచరించిన ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వేలాదిమంది స్థానిక సిద్దవటంరోడ్డులోని ఈద్గా వద్దకు వెళ్ళి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మతగురువు ముఫ్తిఅబ్దుల్ హాదిమౌలానా మాట్లాడుతూ రంజాన్ చాలా పవిత్రమైన రోజు అని, సేవానిరతికి ప్రతీక అయిన రంజాన్ పండుగ నాడు ప్రతి పేదలకు సహాయం చేయాలని, రంజాన్ యొక్క పవిత్రతను, విశిష్టతను వివరించారు. ప్రవక్త బోధించిన శాంతి సన్మార్గంలో నడవాలని పిలుపిచ్చారు. అనంతరం ఖురాన్‌లోని సూక్తులను ప్రబోధించారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్ద ముందస్తు జాగ్రత్త చర్యగా అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

కాశినాయనలో..

కాశినాయన : ఉదయాన్నే కొత్తబట్టలు ధరించి పరిమళద్రవ్యాలతో గ్రామాల్లోని ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద మతగురువులు ఈదుల్‌ఫితర్ నమాజ్‌ను చదివారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలు స్నేహితులకు, బంధువులకు విందును ఏర్పాటు చేశారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల : ఈద్గా వద్దకు వచ్చిన ముస్లింలకు యువనేత చిత్తా గిరిప్రణీత్‌రెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిరిప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ నమాజ్‌కు వచ్చిన ముస్లింలకు మజ్జిగ పంపిణీ చేయాలని సర్పంచ్ రవిప్రకాష్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రకాష్‌రెడ్డి ఆదేశంతో ఈ కార్యక్రమం చేశామన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మదర్‌థెరెసా ఫౌండేషన్ కార్యకర్తలు పాల్గొన్నారు.



బద్వేలులోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ఖాజీపేట : టీచర్స్‌కాలనీలో ఉన్న ఈద్గ వద్ద ప్రత్యేక ప్రార్థనలు



మైదుకూరు : మైదుకూరులో ఈద్గా వద్ద ప్రార్థనలు



నరసాపురంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మజ్జిగ, ఆరంజ్ జ్యూస్ పంపిణీ చేస్తున్న అల్లుట్ల కొండయ్య చారిటబుల్ ట్రస్టు సభ్యులు



పోరుమామిళ్లలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం



రాజుపాళెం : ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



చాపాడు : రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



ఖాజీపేట : సర్వర్‌ఖాన్ పేటలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.శ్రీను తెలిపారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో రూపొందించిన విద్యుత్ షాకులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం...అధికారంలోకి వచ్చాక విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపిందని అన్నారు. విద్యుత్ వినియోగదారుల జేబులకు చిల్లులు పడేలా ప్రభుత్వం తీసుకువచ్చిన టైం ఆఫ్ డే టారిఫ్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకుని ట్రూ ఆప్ ఛార్జీలు,



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ఇంధన సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు, శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుల కడుపు కొట్టిన 'కూటమి'

కమలాపురం: తీవ్ర కరువుతో కొట్టు మిట్టాడుతున్న కమలాపురం నియోజకవర్గ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం కూటమి ప్రభుత్వం రైతుల కడుపు కొట్టినట్టేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోయి అప్పులు చేసుకుని దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నప్పటికి కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించక పోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కమలాపురంలోని ఒక్క మండలం కూడా లేక పోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఎన్‌డీఏ కార్యకర్తలు

మైలవరం : మండలంలోని వద్దిరాల గ్రామానికి చెందిన ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలోని సుంకులాంబ తిరునాల సందర్భంగా ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఎన్‌డీఏ కూటమికి చెందిన కొందరు కార్యకర్తలు స్థానిక నాయకుడు వెంపలాకు రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంపలాకు చెన్నూరు యాదవ్, పెద్దలక్షుమయ్య, దస్తగిరి, గద్వాల్ ఖాసీ, పి.సుబ్రమణ్యం, గురుశేఖర్, ఫణీత్, మరో 15 మంది పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు



పార్టీలోనికి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ

ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందేవన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మహాలక్ష్మీ, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, చిన్నకొమెర్ల సర్పంచ్ జగదీశ్వరరెడ్డి, జమ్మలమడుగు కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, మున్సిపాలిటీల విభాగ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతుల కడుపు కొట్టిన కూటమి ప్రభుత్వం

కమలాపురం: తీవ్ర కరువుతో కొట్టు మిట్టాడుతున్న కమలాపురం నియోజకవర్గ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడం కూటమి ప్రభుత్వం రైతుల కడుపు కొట్టినట్టేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథ శర్మ ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అతి వృష్టి, అనావృష్టి కారణంగా రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా నష్టపోయి అప్పులు చేసుకుని దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నప్పటికి కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించక పోవడం విచారకరం అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో కమలాపురంలోని ఒక్క మండలం కూడా లేక పోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోందన్నారు. నియోజకవర్గ రైతులు వర్షాధార పంటలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, సాగు చేసిన పంటలకు పెట్టుబడులు సైతం రాక భూములను చూసిన రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలో 10 మండలాలను కరువు ప్రాంతంగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 51 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల కరువు విలయ తాండవం చేస్తున్నప్పటికీ కేవలం 10 మండలాలనే కరువు మండలాలుగా గుర్తించడం చూస్తుంటే రైతుల ఓట్లతో అందలమెక్కిన నాయకులు రైతాంగ సమస్యల పట్ల ఏ మాత్రం శ్రద్ధ వహించలేదన్న విషయం అర్థం అవుతోందన్నారు. నీటి పారుదల సౌకర్యం ఉన్న దువ్వూరు, మైదుకూరు, ఖాజీపేట, చాపాడు మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన అధికారులు తీవ్ర కరువుతో అలమటించిపోతున్న కమలాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించక పోవడం చూస్తుంటే అధికారులు రైతుల పట్ల చిన్నచూపు చూస్తున్నారని అర్థం అవుతోందన్నారు.

వైభవంగా నారాయణస్వామి తిరునాల



ప్రత్యేక అలంకరణలో నారాయణ స్వామి



తిరునాలలో పాల్గొన్న భక్తులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బాలుపల్లె సమీపంలో వెలసిన కమ్మేటిపల్లె నారాయణస్వామి తిరునాల సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది ఉగాది మరుసటి రోజు నారాయణ స్వామి తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. నారాయణస్వామి, రామయ్యస్వామి, కంటిపాపులమ్మ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు.

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వాములను దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. విందు భోజనం ఏర్పాటు చేసుకున్నారు. రామయ్యస్వామి శిష్యులు చేసిన గుర్రపు స్వారీ భక్తులను అలరించింది. ఆలయ ధర్మకర్తలు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కరువు భత్యాన్ని ప్రకటించండి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం కరువు భత్యాన్ని ప్రకటించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు ప్రసాద్ కోరారు. సోమవారం కడపలోని ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన వెంటనే కరువు భత్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ అమరావతి కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర ఉమాకాంత్ మాట్లాడుతూ వయస్సు పైబడిన వారికి ,చిన్న పిల్లల తల్లులకు, వికలాంగులకు, అనారోగ్యులకు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్

10వ తరగతి స్పాట్ నుండి మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. ఏపీటీఎఫ్ అమరావతి మహిళా కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి నాయకులు రాజగోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామం, డాక్టర్ వైఎస్ఆర్ ఉల్లిమెళ్ల లేక్ ఫ్రంట్‌లో ఉగాది పార్న, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. స్థానిక శిల్పారామంలో సోమవారం సాయంత్రం వేదాంత హాస్పిటల్ వారి సౌజన్యంతో యువ రాజా డ్యాన్స్ స్కూల్ వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. అలాగే వైఎస్సార్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో రంజాన్ సందర్భంగా సోమవారం ఎస్కే డ్యాన్స్ స్టూడియో వారి ఆధ్వర్యంలో జగన్నాథం మూవీ టీం హీరో రాయలసీమ భరత్, స్కూల్ లైఫ్ మూవీ హీరో అండ్ డైరెక్టర్ పులివెందుల మహేష్, వృషభ లీడర్ జీవన్‌రెడ్డి, సపోర్టింగ్ క్యారెక్టర్ కిట్టులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు